సాక్షి మెదక్

గురువారం । 17 । ఆగస్టు । 2023



మందుబాబుల ఆగడాలు

హుస్నాబాద్ పట్టణంలో యథేచ్ఛగా బెల్ట్ షాపులు నడుపుతున్నారు. మందుబాబుల వీరంగం సృష్టిస్తుండగా.. స్థానికులు అవస్థలు పడుతున్నారు. 8లో



భయం వీడితే విజయం మీదే

భయం వీడినప్పుడే విద్యార్థులు సులభంగా విజయాలు సాధిస్తారని ప్రముఖ వ్యక్తిత్వ శిక్షణ నిపుణులు యండమూరి వీరేంద్రనాథ్, గంప నాగేశ్వర్‌రావు అన్నారు. 8లో

62 మంది ఎంపిక

మెదక్ కలెక్టరేట్: ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటీస్ షిప్ మేళాకు 62 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు మెదక్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14న పట్టణంలోని ఐటీఐ కాలేజీలో ఈ మేళాను నిర్వహించగా 82 మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

సీఎం పర్యటన వాయిదా

మెదక్ కలెక్టరేట్: సీఎం కేసీఆర్ మెదక్ పర్యటన ఈనెల 23కు వాయిదా పడినట్లు కలెక్టర్ రాజర్షి షా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19న మెదక్ నూతన కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయ ప్రారంభోత్సవాలకు సీఎం రావాల్సి ఉంది. ఆ రోజు జిల్లాలో భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ తెలిపింది. ఈ నేపథ్యంలో సీఎం పర్యటన వాయిదా పడింది. 23న జిల్లాకు కేసీఆర్ వస్తారు.

సంక్షేమ పథకాలు అందేలా చూస్తాం



దరఖాస్తులు తీసుకుంటున్న బీజేపీ నాయకులు

మెదక్: అర్హత ఉన్నా ప్రభుత్వ పథకాలు అందని వారు తమకు దరఖాస్తు అందించాలని, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని 12, 13, 27 వార్డులలో డబుల్ బెడ్ రూమ్, గృహలక్ష్మి, దళిత బంధు, బీసీ బంధు, పింఛన్ల కోసం దరఖాస్తులు ఇచ్చారని తెలిపారు. వీటిని తహసీల్దారుకు పంపించి సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, సీనియర్ నాయకులు లోకేష్, బక్కవారి శివ, కలిగి నాగరాజు, సంగీత, బసవరాజు, ప్రభాకర్, చిరంజీవి పాల్గొన్నారు.

పక్కాగా పంటల నమోదు



వరి పంటను పరిశీలిస్తున్న గోవింద్

మనోహరాబాద్(తూప్రాన్): గ్రామాలలో పంటల వివరాల నమోదును పక్కాగా చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పాలాట గ్రామంలో ఆయన పర్యటించి పంటల నమోదు ప్రక్రియను పరిశీలించారు. రైతులు పంటల వివరాలు తెలపాలని సూచించారు. రసాయనాల వాడకం తగ్గించాలన్నారు. వీరి వెంట ఏఈఓ నరేందర్, ఉప సర్పంచ్ యాదగిరిగౌడ్, శ్రీనివాస్ ఉన్నారు.

మహామంత్ర హవనం



హోమం నిర్వహిస్తున్న భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలో కొలువైన భగలాముఖి శక్తిపీఠంలో బుధవారం అమావాస్య సందర్భంగా విశిష్ట పూజ మహోత్సవాలు నిర్వహించారు. వేదపండితుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో భగలాముఖి అమ్మవారికి ప్రత్యేక పూజలు, మహామంత్ర హవనం, అభిషేకం, హోమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో భగలాముఖి ట్రస్ట్ సభ్యులు, జెడ్పీటీసీ పబ్బ మహేష్‌గుప్తా, సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, స్వరూప రమేష్‌గుప్తా దంపతులు పాల్గొన్నారు.

డివిజన్‌పై ప్రకటన చేయాలి



దీక్షా శిబిరం వద్ద సుప్రభాతరావు, బాలక్రిష్ణ

మెదక్: ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే రామాయంపేట రెవెన్యూ డివిజన్ ఏర్పాటు విషయమై సీఎంతో ప్రకటన చేయించాలని పీసీసీ సభ్యులు సుప్రభాతరావు, మ్యాడం బాలక్రిష్ణ డిమాండ్ చేశారు. రామాయంపేటలో కొనసాగుతున్న దీక్షా శిబిరాన్ని బుధవారం వారు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్ కోసం 150 రోజులుగా దీక్ష చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని అన్నారు. స్పందించకపోతే మంత్రి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, అధికార పార్టీ నాయకులను రామాయంపేటలో అడుగు పెట్టనివ్వమని హెచ్చరించారు. రమేశ్‌రెడ్డి, హఫీజ్, గోవర్ధన్, అశోక్‌నాయక్, సత్యనారాయణగౌడ్, గౌండ స్వామి, డాకి స్వామి, అల్లాడి వెంకటేష్, షేక్ సల్మాన్, కుమార్‌సాగర్, రత్నం పాల్గొన్నారు.

కొత్త కలెక్టరేట్‌లోకి..

కొత్త కలెక్టరేట్‌లోకి పాత కలెక్టరేట్ సామగ్రి తరలింపు ప్రక్రియ ప్రారంభమైంది. కలెక్టర్ రాజర్షిషా ఆదేశాల మేరకు బుధవారం పలు శాఖల అధికారులు తమ కార్యాలయాల్లోని రికార్డులను, ఫర్నిచర్‌ను డీసీఎం, ట్రాక్టర్, ఆటోలలో కొత్త కలెక్టరేట్‌కు తరలించారు. మరికొన్ని కార్యాలయాల్లో సామగ్రిని, రికార్డులను తరలించేందుకు ప్యాక్‌చేసి సిద్ధం చేశారు. ముందుగా జిల్లా పౌరసరఫరాల శాఖ, బీసీ వెల్ఫేర్‌తోపాటు మరో రెండు శాఖల నుంచి ఫర్నిచర్ తరలించారు.

\- మెదక్ కలెక్టరేట్



బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో రికార్డుల ప్యాకింగ్



డీసీఎంలో రికార్డుల బస్తాలు



ఆటోలో తరలిస్తున్న రికార్డులు

ప్రారంభానికి ముందే పగుళ్లు

పైన పటారం.. లోన లొటారం అన్నట్లు ఉంది కొత్త కలెక్టరేట్ పరిస్థితి. పైపై రంగులతో భవనానికి మెరుగులు దిద్దుతున్నప్పటికీ లోపల లోపాలు అనేకం. ప్రారంభానికి ముందే బీటలువారిన గోడలు దర్శనమిస్తున్నాయి. అధికారులు, కాంట్రాక్టర్ల ఉదాసీనతతో భవన నిర్మాణంలో నాణ్యతా లోపం స్పష్టంగా కనిపిస్తోంది.

- కొత్త కలెక్టరేట్ భవన నిర్మాణంలో నాణ్యతా లోపం
- గదుల్లో నెర్రలు బారిన గోడలు
- ఐదేళ్లపాటు కొనసాగుతున్న పనులు
- కాంట్రాక్టర్, అధికారులపై విమర్శలు



కలెక్టరేట్ భవన సముదాయం

మెదక్: సకల సేవలు ఒకేచోట అందించడానికి జిల్లా కేంద్రంలో నిర్మించిన నూతన కలెక్టరేట్ సముదాయం ప్రారంభానికి ముందే పగుళ్లు ఏర్పడ్డాయి. నాణ్యత లేకుండా పనులు చేపట్టడంతో భవనంలోని గదుల్లో గోడలు బీటలు వారుతున్నాయి. కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఐదేళ్లపాటు భవన నిర్మాణం చేసిన కాంట్రాక్టర్‌లు, అధికారులపై విమర్శలు వస్తున్నాయి.

కోట్లు ఖర్చు చేసి

నూతన కలెక్టరేట్ భవన నిర్మాణం కోసం పట్టణంలోని ఔరంగాబాద్ శివారులో 55 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. 2018లో సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. దీని నిర్మాణం కోసం



గోడలకు పడిన రంధ్రాలు


ప్రభుత్వం రెండు పర్యాయాలు రూ.67.7 కోట్లు విడుదల చేసింది. ఆర్‌అండ్‌బీశాఖ పనులను పర్యవేక్షించింది. రెండేళ్లలో పనులు పూర్తి చేయాల్సి ఉండగా ఐదేళ్ల వరకు సాగదీశారు. ప్రారంభోత్సవ సమయం దగ్గర పడుతున్నప్పటికీ నేటికీ పనులు చేస్తున్నారు. ఈ సమీకృత కలెక్టరేట్‌ను ఈ నెల 19న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించాల్సి ఉండగా, అనివార్య కారణాల వల్ల ఈనెల 23కు వాయిదా పడింది.

సరిచేస్తాం

> కలెక్టరేట్‌లోని గోడలకు నెర్రలు బారిన విషయం మాదృష్టికి రాలేదు. మా అధికారులు అక్కడే ఉండి పనులు చేయిస్తున్నారు. గోడలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం.
>
> **వెంకటేశం, ఆర్‌అండ్‌బీ డీఈ**

బీటలు వారుతున్న గోడలు

కలెక్టరేట్ భవనం జీప్లస్–3 అంతస్థుల్లో నిర్మించారు. ఇందులో 60 శాఖల కోసం వందకు పైగా గదులు నిర్మించారు. వీటిల్లో అనేక గదుల్లో నెర్రలు బారాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏఓ కార్యాలయం గది డోరు పగిలింది. డీపీఆర్ ఆఫీస్‌లోని ఓ గది గోడకు పగుళ్లు వచ్చాయి. విద్యాశాఖ కార్యాలయంలో లోపలిభాగంతో పాటు చుట్టూ గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. అసిస్టెంట్ కలెక్టర్ (యూటీ) కార్యాలయంలో బీమ్‌కింది భాగంగా పగుళ్లు ఏర్పడి పెచ్చులు ఊడాయి. బయట గోడలకు అనేకచోట్ల పగుళ్లు ఏర్పడ్డాయి. కొన్నిగదుల్లో కిటికీలు బిగింపు సమయంలో ఏర్పడిన రంధ్రా లను లప్పంతో పూడ్చినా అవి స్పష్టంగా కనిపిస్తున్నాయి. అలాగే వర్షాలకు గోడలు పదునెక్కి ఉన్నాయి. మత్స్యశాఖ కార్యాలయంలో లోపలి, బయట భాగంలోని గోడలకుపగుళ్లు వచ్చాయి. భవనంలో గోడలు నెర్రబారినా అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.



గోడలకు ఏర్పడిన పగుళ్లు

21న ఓటర్ ముసాయిదా జాబితా

కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లోని కళాశాలల్లో అసిస్టెంట్ ఎలక్షన్ రోల్ ఆఫీసర్(ఏఈఆర్ఓ)లను నియమించినట్లు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. బుధవారం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి, జాయింట్ సీఈఓ సర్ఫరాజ్ అహ్మద్ అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో ఓటరు నమోదు కార్యక్రమం, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెదక్, నర్సాపూర్ నియోజక వర్గాలలోని కళాశాలలలో ఓటు నమోదు పర్యవేక్షకులుగా ఏఈఆర్‌ఓలను నియమించినట్లు తెలిపారు. ఓటు నమోదు, ఓటింగ్ శాతం పెంచటానికి అవగాహన కార్యక్రమంలో భాగంగా ఈ నెల19న 2కే రన్ వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 21న జిల్లాలోని అన్ని పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఓటర్ ముసాయిదా జాబితా ప్రదర్శన, ప్రచురణ ప్రతులను గ్రామ పంచాయతీ, పోలింగ్ స్టేషన్లలో ఓటర్లకు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్‌ఓ పద్మశ్రీ, అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్

సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ ఖాయం

ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్: సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సాధిస్తారని ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి జోస్యం చెప్పారు. బుధవారం స్థానిక సాయిక్రిష్ణ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్న బీఆర్ఎస్ రాబోయే ఎన్నికలలో గెలవడం ఖాయమన్నారు. ఈనెల 23న మెదక్‌కు వస్తున్న సీఎం పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం జరిగే బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి 40వేల మందిని తరలించాలని మంత్రి హరీశ్‌రావు లక్ష్యంగా నిర్ణయించారని చెప్పారు. సభను విజయవంతం చేసేందుకు నాయకులు కృషి చేయాలని కోరారు. నియోజకవర్గానికి మూడు వేల గృహలక్ష్మి ఇళ్లను కేటాయించారని, మరో రెండు వేల ఇళ్లను కేటాయించాలని మెదక్ సభలో సీఎంకు విజ్ఞప్తి చేస్తానని చెప్పారు.

రాష్ట్ర మహిళ కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాల్గొనే మెదక్ బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. జనాన్ని భారీగా తరలించాలని ఆమె కోరారు. సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందన్నారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చొరవతో నర్సాపూర్ నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి చెందిందని చెప్పారు. కేసీఆర్ మళ్లీ సీఎం కావడం ఖాయమని చెప్పారు. సమావేశానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, అసంఘటిత కార్మిక బోర్డు చైర్మన్ దేవేందర్‌రెడ్డి, సంగారెడ్డి జిల్లా జెడ్పీ ఉపాధ్యక్షుడు ప్రభాకర్, ప్యాక్స్ చైర్మన్ రాజుయాదవ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, వెంకట్‌రెడ్డి, శేకర్, అశోక్‌గౌడ్, శ్రీధర్‌గుప్తా, నయిం, సుధీర్‌రెడ్డి, భిక్షపతి, వీరేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, పక్కన సునీతారెడ్డి, యాదవరెడ్డి

మేం తెలంగాణ బిడ్డలం కాదా?

కలెక్టరేట్ ఎదుట సెకండ్ ఏఎన్ఎంల ఆందోళన

మెదక్ కలెక్టరేట్: మేం తెలంగాణ బిడ్డలం కాదా? అందరినీ రెగ్యులరైజ్ చేస్తున్న సీఎం కేసీఆర్ 15 నుంచి 20 ఏళ్లుగా రోగులకు సేవలందిస్తున్న తమను ఎందుకు పట్టించుకోవడం లేదని సెకండ్ ఏఎన్ఎంలు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు తన్వీర్ మాట్లాడుతూ.. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో కొందరిని, వీఆర్ఏలను రెగ్యులరైజ్ చేసిన సీఎం తమను ఎందుకు చిన్నచూపు చూస్తున్నారని అన్నారు. ఎప్పటికైనా రెగ్యులరైజ్ అవుతుందన్న ఆశతో ఉన్నామని, కొత్తగా నోటిఫికేషన్ వేసి తమ కుటుంబాలను రోడ్డున పడేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. 15 రోజులుగా ఆందోళనలు చేస్తున్న ప్రభుత్వం స్పందించక పోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో తులసి, సంగీత, సులోచన, రమ్య, యాదమ్మ పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు

ఆలిండియా సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలు



పోటీల్లో పాల్గొన్న మహిళా ఉద్యోగి

మెదక్ కలెక్టరేట్: జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఆలిండియా సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలు నిర్వహించారు. పట్టణంలోని ఇందిరాగాంధీ అవుట్‌డోర్ స్టేడియం, పీఎన్ఆర్ ఇండోర్ స్టేడియం, ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం, గుల్షన్ క్లబ్‌లలో పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా స్త్రీ పురుషులకు అథ్లెటిక్స్, షటిల్ బ్యాడ్మింటన్, క్రికెట్, చెస్, వాలీబాల్, క్యారమ్స్ నిర్వహించారు. 62 మంది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు పోటీలలో పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపినవారు ఎంపికైనవారు 18వ తేదీ నుంచి 21 వరకు హైదరాబాదులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి నాగరాజు, పీడీలు శ్రీనివాసరావు, మాధవరెడ్డి, పీఈటీలు శ్యామయ్య, వినోద్, దాసరి మధు, రాజేందర్, నరేష్, రవి, సత్యనారాయణ, దేవేందర్‌రెడ్డి, ప్రదీప్, హరీష్ పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాకే మెదక్ రావాలి

డీసీసీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి

మెదక్: జిల్లాకు సీఎం కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చిన తర్వాతే కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి రావాలని, లేదంటే పర్యటనను అడ్డుకుంటామని డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడారు. 2014 ఎన్నికల సమయంలో జిల్లాను అభివృద్ధి చేసేది చాలా ఉందని చెప్పిన కేసీఆర్ ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో నిజాం షుగర్ ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు.

మెదక్ చుట్టూ బైపాస్ రోడ్డు, పట్టణంలో అండర్‌గ్రౌడ్ డ్రైయినేజీ కాలువల నిర్మాణం, ఏడుపాయల ఆలయ అభివృద్ధి ఊసే లేదన్నారు. అంతేకాకుండా మెదక్ నుంచి అనేక ప్రభుత్వ కార్యాలయాలను సిద్దిపేటకు తరలించుకు పోతుంటే ఈ ప్రాంత ఎమ్మెల్యే నోరు మెదపటం లేదన్నారు. కార్యక్రమంలో మామిండ్ల ఆంజనేయులు, ప్రభాకర్‌రెడ్డి, పల్లె రాంచందర్ గౌడ్, దాయర లింగం, ఆవారి శేఖర్, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు శ్యాంసుందర్, గోవింద్ నాయక్, శంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి

కాంగ్రెస్ హయాంలో గిరిజనులకు పెద్దపీట

హవేళీఘనపూర్: బీఆర్ఎస్ ప్రభుత్వం మాయమాటలు చెప్పి ప్రజలను మరోమారు మోసం చేసే కుట్ర చేస్తుందని డీసీసీ అధ్యక్షులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి ఆరోపించారు. కొచ్చెరుతండా, స్కూల్ తండా, ఔరంగాబాద్ తండా, బూర్గుపల్లి గ్రామాల్లో గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి విలాసవంతమైన ఇళ్లు కట్టుకున్నారు కానీ, పేదలకు ఒక్క డబుల్‌బెడ్‌రూమ్ ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. కార్యక్రమంలో పీసీసీ మెంబర్ మామిళ్ల ఆంజనేయులు, శ్రీనివాస్‌గౌడ్, పల్లె రాంచందర్‌గౌడ్, గూడూరి ఆంజనేయులు, మహేందర్‌రెడ్డి, లక్కర్సు శ్రీనివాస్, ప్రేమ్ కుమార్, పద్మారావు, మహేష్ ఉన్నారు.

వీఆర్ఏల క్రమబద్ధీకరణపై రగడ

నిజాంపేట (మెదక్): వీఆర్ఏలను క్రమబద్ధీకరించడంతో అసలుదారులు, వతందారుల మధ్య గొడవ జరిగింది. దీంతో నిజాంపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం పలువురు మహిళా వీఆర్ఏలు వంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మండల కేంద్రానికి చెందిన వీఆర్ఏ బత్తుల శ్రీనివాస్ క్రమబద్ధీకరణలో భాగంగా తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. వతందారులు అతనితో మాట్లాడటానికి ప్రయత్నించగా ముఖం చాటేస్తున్నాడు. దీంతో మనోవేదనకు గురైన శివ్వవ్వ, లక్ష్మి, భార్గవి తహసీల్దార్ కార్యాలయం వద్ద పెట్రోల్ పోసుకొని నిప్పటించుకోవడానికి యత్నించారు. స్థానికులు అడ్డుకున్నారు. క్రమబద్ధీకరణలో తమకు అన్యాయం జరిగిందని బోరుమన్నారు. తహసీల్దార్ స్వప్న మాట్లాడుతూ ఈవిషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు.



పెట్రోల్ బాటిళ్లతో మహిళా వీఆర్ఏలు

రైతు వ్యతిరేకి కాంగ్రెస్ పార్టీ



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): వర్షాలతో ఇళ్లు పూర్తి స్థాయిలో దెబ్బతిన్నవారికి గృహలక్ష్మి పథకంలో ప్రాధాన్యమిస్తామని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో వర్షాలకు ఇళ్లు దెబ్బతిన్న 60 మందికి నష్టపరిహారం అందించారు. అలాగే 19 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పరిహారంతో ఇళ్లకు మరమ్మతులు చేయించుకోవాలని చెప్పారు. రైతులకు 3 గంటల విద్యుత్ చాలంటూ కాంగ్రెస్ నాయకులు రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, పట్లోరి రాజు, శ్రీనివాస్‌రెడ్డి, పోచయ్య, లక్ష్మణ్, మల్లేశం, నరేష్ పాల్గొన్నారు. అనంతరం చందంపేటలో బీఆర్ఎస్ కార్యకర్త తాటికొండ యాదగిరి ఇటీవల మృతిచెందడంతో ఆయన కుటుంబసభ్యులకు రూ.2లక్షల బీమా చెక్కును అందించారు.

లెర్నింగ్ లైసెన్స్‌ల అందజేత

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ మేళాలో భాగంగా 200 మంది యువకులకు లెర్నింగ్ లైసెన్స్‌లను ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో చిన్న శంకరంపేట మండల బీఆర్ఎస్ అధ్యక్షులు రాజు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఉమర్, జుబేర్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

యువతకు లెర్నింగ్‌ లైసెన్సులు



లెర్నింగ్‌ లైసెన్సు పొందిన యువకులతో రాజీవ్‌రెడ్డి తదితరులు

చేర్యాల(సిద్దిపేట): ఉచితంగా లైసెన్సు కార్యక్రమానికి ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి శ్రీకారం చుట్టగా, దరఖాస్తు చేసుకున్న యువకులకు బుధవారం ఆర్టీఏ కార్యాలయ ఆవరణలో లెర్నింగ్‌ లైసెన్సులను అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ నిమ్మ రాజీవ్‌రెడ్డి, పట్టణ యూత్‌ అధ్యక్షుడు యాట భిక్షపతి, మండల యూత్‌ అధ్యక్షుడు ఆకుల రాజేష్‌గౌడ్‌ మాట్లాడుతూ, ఎమ్మెల్యే యాదగిరిరెడ్డి, నియోజకవర్గ కో–ఆర్డినేటర్‌ గుజ్జ సంపత్‌రెడ్డి సూచనల మేరకు దరఖాస్తు చేసుకున్న వారికి లైసెన్సులు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ, మండల పరిధిలోని పలు గ్రామాల యువత తదితరులు పాల్గొన్నారు.

సైబర్‌ కేటుగాళ్ల మోసం

రూ.3,87,669ల నగదు పోగొట్టుకున్న ముగ్గురు : సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్‌: గుర్తు తెలియని వ్యక్తుల మోసపూరిత మాటలకు పలువురు నగదు పోగొట్టుకున్నారు. సిద్దిపేట సీపీ శ్వేత కథనం ప్రకారం.. సిద్దిపేట వన్‌ టౌన్‌ స్టేషన్‌ పరిధిలో.. జాబ్‌ ఉందని వాట్సప్‌ మెసేజ్‌కు స్పందించి ఆన్‌లైన్‌లో రూ.1.60 లక్షలను ఓ వ్యక్తి పోగొట్టుకున్నాడు. బాధితుడు పంపిన ఖాతాలో ఉన్న రూ.71వేలను పోలీసులు ఫ్రీజ్‌ చేశారు. అలాగే చిన్నకోడూర్‌ పోలీసు స్టేషన్‌ పరిధిలో.. రూ.5లక్షల లోన్‌ మంజూరైందని చెప్పి ఓ వ్యక్తి నుంచి ఆన్‌లైన్‌లో రూ.1,57,784ను ఆగంతకుడు వసూలు చేశాడు. హుస్నాబాద్‌ పోలీసు స్టేషన్‌ పరిధిలో.. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ క్రెడిట్‌ కార్డు రివార్డు పాయింట్ల గడువు ముగుస్తోందని లింకు పంపగా, వివరాలు, ఓటీపీ నమోదు చేసి రూ.69,885లు పోగొట్టుకున్నాడు ఓ వ్యక్తి. ఆయా బాధితులు వెంటనే జాతీయ హెల్ప్‌లైన్‌ నంబర్‌లో ఫిర్యాదు చేశారని శ్వేత తెలిపారు.

బాలిక కిడ్నాప్‌ కథ సుఖాంతం

మద్దూరు(హుస్నాబాద్‌): ఓ బాలిక కిడ్నాప్‌కు గురైన ఘటన దూళ్మిట్ట మండలకేంద్రంలో మంగళవారం జరుగగా బుధవారం ఆలస్యంగా వెలుగుచూసింది. అయితే గంటల వ్యవధిలోనే కేసును పోలీసులు ఛేదించారు. దీంతో కిడ్నాప్‌ కథ సుఖాంతమైంది. ఏఎస్‌ఐ విజయకుమార్‌ కథనం ప్రకారం.. స్వాతంత్య్ర దినోత్సవం రోజున మండలకేంద్రానికి చెందిన బాలిక ఇంటి నుంచి వెళ్లి రాలేదు. దీంతో ఆమె తల్లిదండ్రులు, మద్దూరు పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు గంటల వ్యవధిలో అదే గ్రామానికి చెందిన పోతురాజు ప్రశాంత్‌ కిడ్నాప్‌ చేసినట్లు గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకున్నారు. వెంటనే తల్లిదండ్రులకు బాలికను అప్పగించారు. ఆ మేరకు నిందితుడిపై కిడ్నాప్‌ కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ పేర్కొన్నారు.

మందుబాబుల ఆగడాలు

- వీధుల్లో యథేచ్ఛగా బెల్ట్‌ షాపులు
- మద్యానికి బానిసవుతున్న యువకులు
- ఇబ్బందులకు గురవుతున్న మహిళలు



ఎక్సైజ్‌ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మహిళలు

హుస్నాబాద్‌: పట్టణంలో యథేచ్ఛగా 50 వరకు బెల్ట్‌ షాపులు నడుపుతున్నారు. తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు మందు దొరుకుతోంది. పట్టణంలోని పలు వీధుల్లో ఉన్న బెల్ట్‌ షాపుల ముందే మత్తులో మందుబాబులు వీరంగం సృష్టిస్తున్నారు. దీంతో చుట్టూ ఉన్న గృహాల వారు అవస్థలు పడుతున్నారు. చదువుకునే పిల్లలకు ఇది ఆటంకంగా మారింది. ఇళ్ల ఎదుట మందుబాబులు వాహనాలు పార్క్‌ చేస్తుండటంతో తమవి ఎక్కడ పెట్టుకోవాలంటూ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే తాగిన మైకంలో అక్కడే మూత్ర విసర్జన చేస్తుండటంతో మహిళలు తలుపులు తీయలేని పరిస్థితి నెలకొంది. కాగా కాలనీవాసులు బెల్ట్‌ షాపుల నిర్వాహకులతో గొడవలు పెట్టుకున్న దాఖలాలు కోకొల్లలు. ఈ విషయంపై ఎక్సైజ్‌ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోతోందని పలు కాలనీల మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, మద్యానికి బానిసై ఈ నెల రోజుల వ్యవధి లో పట్టణంలో కాలేయ వ్యాధితో 20 మంది మృతిచెందారు. ఈ వ్యాధితో ఆస్పత్రులకు వెళితే వైద్యం చేయించుకునే స్థోమత లేక మరణిస్తున్నా రు. ఆఖరుకు వీరి కుటుంబాలను రోడ్డుపాలు చేస్తున్నారు.

మహిళల ధర్నా

పట్టణంలో వెలిసిన బెల్ట్‌ షాపులు ఎత్తేయాలని బుధవారం ఎక్సైజ్‌ కార్యాలయం ఎదుట మహిళలు, స్థానికులు ధర్నా నిర్వహించారు. పేదల ఆరోగ్యాలతో చెలగాటం ఆడొద్దని, మద్యానికి బానిసై యువత చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మందుబాబుల అసభ్య ప్రవర్తనతో బెల్ట్‌ షాపుల పరిధిలో ఉన్న కుటుంబాలవారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆగస్టు 15న కూడా షాపులు తెరిచారని గుర్తుచేశారు. ఎక్సైజ్‌ అధికారులు టెండర్లలో తలమునకలై పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బెల్టుషాపులను నిర్మూలించకపోతే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్‌ రవీందర్‌ గౌడ్‌, కౌన్సిలర్‌ శ్రీనివాస్‌, కాలనీవాసులు పూదరి శ్రీనివాస్‌, పిల్లి కనకయ్య, తాళ్లపల్లి రాజయ్య, బైరి రవీందర్‌, తాళ్లపల్లి కొమురయ్య, బండి యాదగిరి, తాళ్లపల్లి స్వరూప, బైరి రాధా, బైరి రమ, పోలవేణి మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

కేసులు నమోదు చేస్తాం

అనుమతి లేకుండా బెల్ట్‌ షాపులు నిర్వహిస్తున్న యజమానులపై చర్యలు తీసుకుంటాం. మహిళలు ధర్నా చేయడం బాధాకరం. సిబ్బందిని ఆదేశించాం. షాపులు అలాగే తెరిస్తే కేసులు నమోదు చేస్తాం.

– దామోదర్‌, హుస్నాబాద్‌ ఎక్సైజ్‌ ఎస్‌ఐ

స్వచ్ఛతకు ఉత్తమ పంచాయతీ గుర్తింపు



పారిశుద్ధ్య వాహనం ఫొటోను సేకరిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్‌ అధికారిణి ప్రవళిక

ములుగు(గజ్వేల్‌): వంద శాతం స్వచ్ఛత కలిగి ఉంటే ఉత్తమ గ్రామపంచాయతీగా గుర్తింపు లభిస్తోందని, ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను కలిగి ఉండాలని స్వచ్ఛ సర్వేక్షణ్‌ అధికారిణి ప్రవళిక సూచించారు. బుధవారం గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో చేపడుతున్న మురుగు కాల్వలు, ఇంకుడు గుంతలు, డంపింగ్‌ యార్డులు, మరుగుదొడ్లు పరిశీలించారు. పారిశుద్ధ్యం పనితీరు బాగుందని పంచాయతీ సిబ్బందిని అభినందించారు. అనంతరం పనులకు సంబంధించిన ఫొటోలను సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ నర్సింగరావు, సర్పంచ్‌ బాలక్రిష్ణ, ఉప సర్పంచ్‌ స్వామిగౌడ్‌, వార్డు సభ్యులు నవీన్‌, పోచయ్య, కుమార్‌, అన్వేష్‌, ప్రకాష్‌, యాదమ్మ, పంచాయతీ కార్యదర్శి శోభ పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్‌ వర్కర్స్‌ ఫెడరేషన్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్‌



మాట్లాడుతున్న రవికుమార్‌

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): రవాణా రంగ కార్మికులకు వెల్ఫేర్‌ బోర్డు ఏర్పాటు చేయాలని ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్‌ వర్కర్స్‌ ఫెడరేషన్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి రవికుమార్‌ డిమాండ్‌ చేశారు. తెలంగాణ పబ్లిక్‌ – ప్రైవేట్‌ ట్రాన్స్‌పోర్ట్‌ వర్కర్స్‌ ఫెడరేషన్‌ జిల్లా జనరల్‌ బాడీ సమావేశం బుధవారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో రవికుమార్‌ మాట్లాడుతూ ఈ రంగంలోని కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో 20 లక్షల మందికి పని చేస్తున్నారన్నారు. రవాణా రంగం అభివృద్ధిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా ఉన్నాయన్నారు. అర్హులకు ఇంటి స్థలంతోపాటు ఇల్లు కట్టివ్వాలన్నారు. యాక్సిడెంట్‌ బీమా రూ. ఐదు లక్షల నుంచి 10 లక్షలకు పెంచాలన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు మామిడాల కనకయ్య, భాష బోయిన నరసింహులు, గౌర బోయిన నరసింహులు, చింతల మహేష్‌, మల్లం సుధాకర్‌, చొప్పరి రాజశేఖర్‌, సుదర్శన్‌, అంజి పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డీఈఈ శ్రీనివాస్‌రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్‌): మన ఊరు మన బడిలో భాగంగా నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల పనులను నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని జిల్లా పంచాయతీరాజ్‌ డీఈఈ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని సలాఖపూర్‌లో ఈ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుమారు రూ.40లక్షలతో పనులు జరుగుతున్నాయన్నారు. పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ వంగ భాస్కర్‌రెడ్డి, పీఆర్‌ఏఈ విజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌ క్రీడాకారుల ఎంపిక



పోటీలు ప్రారంభిస్తున్న గ్యాదరి పరమేశ్వర్‌, రామేశ్వర్‌రెడ్డి

సిద్దిపేటజోన్‌: జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌ మిడిల్‌ డిస్టెన్స్‌, లాంగ్‌ డిస్టెన్స్‌ పరుగు పందెం పోటీల క్రీడాకారుల ఎంపిక బుధవారం జిల్లా కేంద్రంలోని జయశంకర్‌ స్టేడియంలో నిర్వహించారు. సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్‌ సంఘం అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్‌, ఎస్‌జీఎఫ్‌ సెక్రటరీ పన్యాల రామేశ్వర్‌రెడ్డి పోటీలను ప్రారంభించారు. అనంతరం జిల్లా జట్టు అండర్‌– 20 విభాగంలో సీహెచ్‌. ప్రవీణ్‌ (ఎస్‌డీఏఏ), జే. ప్రవీణ్‌ (ఎస్‌డీఏఏ), సీహెచ్‌. తుల్జారాం (ఎస్‌డీఏఏ), అండర్‌ –18 బాలుర విభాగంలో బి. సంతోష్‌ (టీఎస్‌ఎంజేపీఆర్‌జేసీ దౌల్తాబాద్‌), అండర్‌– 18 బాలికల విభాగంలో సాహితీ (ఎస్‌డీఏఏ, డి. రేణుక (ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిద్దిపేట), అండర్‌– 16 బాలుర విభాగంలో బి.నందేశ్‌ (టీఎస్‌ఎంజేపీఆర్‌ఎస్‌ దౌల్తాబాద్‌), అండర్‌ –14 బాలుర విభాగంలో బి.జగన్‌ (జడ్పీహెచ్‌ఎస్‌ రామంచ), ఆర్‌.రంజిత్‌ (ఎస్‌ఎంహెచ్‌ హాస్టల్‌)ను ఎంపిక చేశామని తెలిపారు. ఈనెల హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో రెజ్లింగ్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి ఉప్పలయ్య, శిక్షకులు కృ ష్ణ కుమార్‌, సాయికుమార్‌ పాల్గొన్నారు.

19న టార్గెట్‌ బాల్‌ జిల్లా జట్ల ఎంపిక

గజ్వేల్‌రూరల్‌: ఈనెల 19న బాల, బాలికల విభాగంలో జిల్లా జట్లను ఎంపిక చేయనున్నట్లు అసోసియేషన్‌ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహ్మద్‌ సమీర్‌, సందీప్‌ పేర్కొన్నారు. బుధవారం విలేకరులతో వారు మాట్లాడుతూ ఈనెల 26, 27వ తేదీల్లో రాష్ట్రస్థాయి సబ్‌ జూనియర్‌ టార్గెట్‌బాల్‌ పోటీలు వరంగల్‌లో జరగనున్నాయని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా నుంచి బాల, బాలికల విభాగంలో క్రీడాకారుల జట్లను ఎంపిక చేస్తున్నట్లు వివరించారు. 2007 జనవరి 1 తర్వాత జన్మించిన వారు అర్హులని, ఆసక్తిగల క్రీడాకారులు ఆధార్‌కార్డుతో పాటు 2 పాస్‌ఫొటోలను తీసుకుని పట్టణంలోని మహతి స్కూల్‌లో 19న జరిగే సెలక్షన్స్‌కు హాజరు కావాలని సూచించారు. వివరాలకు పీఈటీలు తిరుపతి, శ్రీకుమార్‌ 95150 32639, 98664 71376 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఇద్దరి అదృశ్యం



సాయిలు

శివ్వంపేట(నర్సాపూర్‌): ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండలపరిధిలోని మల్లుపల్లిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రవికాంత్‌రావు కథనం ప్రకారం... పాపన్నపేట మండలం గాంధారిపల్లెకు చెందిన అంతమొల్ల సాయిలు కుటుంబం ఏడాదిగా శివ్వంపేట మండలం పల్లుపల్లిలో నివాసం ఉంటుంది. అతను తాగుడుకు బానిసై నిత్యం ఇంట్లోని వారితో గొడవపడుతుండేవాడు. ఈ క్రమంలో ఈనెల 13న కుటుంబ పరిస్థితులపై భార్య, పిల్లలు నిలదీశారు. మరుసటి రోజు వారు పనికి వెళ్లి సాయంత్రం రాగా అతను కనిపించలేదు. ఆందోళనచెందిన వారు బంధువులు, వారికి తెలిసిన వారిని వాకబు చేసినా ఆచూకీ దొరకలేదు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రియల్‌వ్యాపారి..



భిక్షపతి

గజ్వేల్‌రూరల్‌: సొంత పనిపై బయటకు వెళ్లిన వ్యక్తి రాకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బుధవారం మిస్సింగ్‌ కేసు నమోదైంది. గజ్వేల్‌ సీఐ జానీరెడ్డి కథనం ప్రకారం.. పట్టణంలోని ప్రశాంత్‌నగర్‌కు చెందిన భిక్షపతి రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారి. ఈనెల 13న సొంత పనిపై హైదరాబాద్‌ వెళ్తున్నట్లు ఇంట్లో కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లి ఎంతకీ రాలేదు. తెలిసిన వారిని వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దారి తప్పి.. మట్టికుప్పను ఢీ కొట్టి..

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి, మరొకరికి తీవ్రగాయాలు

తొగుట(దుబ్బాక): వెళ్లాల్సిన దారి తప్పి మట్టికుప్పను బైక్‌తో ఢీకొట్టి రోడ్డుపై పడి ఒకరు మృతిచెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన పెద్ద మాసాన్‌పల్లి శివారులో బుధవారం రాత్రి చోటుచేసుకుంది.పోలీసులు కథనం ప్రకారం.. సిద్దిపేట భారత్‌నగర్‌కు చెందిన ఎరువ రాజు (33), కోటిలింగాలకు చెందిన అంకం శివకుమార్‌ (34)తో కలిసి బైక్‌పై కొండపాక మండలంలోని మర్పడ మీదుగా సిద్దిపేట వెళ్లాల్సి ఉండగా, దారితప్పి తొగుట వైపునకు వెళ్లారు. ఈ క్రమంలో పెద్ద మాసాన్‌పల్లి గ్రామ శివారులో బైక్‌ అదుపు తప్పి రోడ్డు పక్కనున్న మట్టికుప్పను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజు అక్కడికక్కడే చనిపోయాడు. శివకుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం పోలీసులు తరలించారు. రాజు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సిద్దిపేటకు తరలించారు.

భయం వీడితే విజయం మీదే

ఇంపాక్ట్‌ ఫౌండేషన్‌ బాధ్యులు యండమూరి వీరేంద్రనాథ్‌, గంప నాగేశ్వర్‌రావు



శిక్షణ తరగతులను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంజీవరెడ్డి

నారాయణఖేడ్‌: భయం వీడినప్పుడే విద్యార్థులు సులభంగా విజయాలను సాధిస్తారని ఇంపాక్ట్‌ ఫౌండేషన్‌ బాధ్యుడు, ప్రముఖ వ్యక్తిత్వ శిక్షణ నిపుణులు యండమూరి వీరేంద్రనాథ్‌, గంప నాగేశ్వర్‌రావు అన్నారు. పట్టణ శివార్లలోని హెచ్‌ఆర్‌ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం పీకేఆర్‌ ట్రస్టు, లయన్స్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇంపాక్ట్‌ శిక్షణ శిబిరాన్ని పీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్‌ సంజీవరెడ్డి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం వీరు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి కార్యక్రమానికీ టైంను గోల్‌గా ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. నారాయణఖేడ్‌లోని యువత, విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలనే ఆలోచనతో సంజీవరెడ్డి ఈ కార్యక్రమాన్ని చేపట్టారని గుర్తు చేశారు. ప్రయత్నం లేకుండా ఎవరూ విజయం సాధించలేరని చెప్పారు. సునాయాసంగా విజయాలు సాధించాలంటే తమలో ఉన్న భయాన్ని పారదోలి ధైర్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అప్పల ప్రసాద్‌, ఆకెళ్ల రాఘవేంద్ర, శ్రీపాదరాం, సుధీర్‌ సంద్రలు సైతం విద్యార్థులకు, యువకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, లయన్స్‌ క్లబ్‌ గవర్నర్‌ లక్ష్మి, బాధ్యులు దిగంబర్‌రావు, రాజు, వెంకట్‌రావు, మహేష్‌కుమార్‌, రవి, శివకుమార్‌, సాయి, ప్రభాకర్‌, ఇంపాక్ట్‌ బాధ్యులు సంతోష్‌, రాజు పాల్గొన్నారు.

ధుండగుడిపై చర్యలు తీసుకోవాలి



ఎస్‌ఐ గంగరాజుకు ఫిర్యాదు అందిస్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులు

దుబ్బాక : మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ గన్నె వనితపై వాట్సాప్‌ గ్రూపుల్లో తప్పుడు పోస్టులు పెట్టిన వ్యక్తిపై వెంటనే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్‌ యువజన నాయకులు భానుచందర్‌, కార్తీక్‌ అన్నారు. ఇటీవల దుబ్బాక మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ పై చెల్లాపూర్‌కు చెందిన శ్రీనివాస్‌ యాదవ్‌ డిగ్రీ చదివిన వారు రూ. 10 లక్షలు ఇస్తే మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ ఉద్యోగం ఇప్పిస్తారని పలు వాట్సప్‌ గ్రూపుల్లో పోస్టు చేశాడన్నారు. బుధవారం ఎస్సై గంగరాజుకు ఫిర్యాదు చేశామన్నారు. చైర్‌పర్సన్‌ వనిత పై తప్పుడు పోస్టులు చేస్తే సహించేది లేదని మండిపడ్డారు. వారి వెంట నాయకులు బాల్‌రెడ్డి, వెంకటేష్‌, రాజు, శ్రీను, తదితరులున్నారు.

నైట్‌ డ్యూటీకి వెళ్తుండగా..

గుర్తు తెలియని వాహనం ఢీకొని సెక్యూరిటీ గార్డు మృతి



చంద్రయ్య స్వామి

సదాశివపేట రూరల్‌(సంగారెడ్డి): నైట్‌ డ్యూటీకి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని ఆరూర్‌ గ్రామ శివారులో బుధవారం చోటుచేసుకుంది. సదాశివపేట సీఐ నవీన్‌ కుమార్‌ కథనం ప్రకారం.. బీదర్‌ జిల్లా చుడుగుప్ప మండలం ముత్తంగికి చెందిన మడుపతి చంద్రయ్య స్వామి (28)ఆరూర్‌ లో నివాసం ఉండి ఓ పరిశ్రమలో సెక్యూరిటీ గార్డుగా పనిచేసేవాడు. అతను మంగళవారం రాత్రి నైట్‌ షిఫ్ట్‌ కు నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో గ్రామ శివారులో జహీరాబాద్‌ నుంచి హైదరాబాద్‌ వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య ఆషారాణి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కేసును సీఐ నవీన్‌కుమార్‌ దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక..



నర్సింలు

కొల్చారం(నర్సాపూర్‌): ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురైన రైతు, గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని అంసాన్‌పల్లిలో బుధవారం ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. గోల్పుల నర్సింలు(45) వ్యవసాయం చేసేవాడు. కొన్నేళ్లుగా పెట్టుబడి కూడా రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తాయి. ఇదే సమయంలో గతేడాది కూతురు పెళ్లికి అప్పులు చేసి మరింత రుణభారంలో కూరుకుపోయాడు. ఇక్కడ జీవితం దుర్భరంగా మారడంతో హైదరాబాద్‌కు బతుకుదెరువు కోసం వెళ్లాడు. ఇటీవల కూతురు ప్రసవించడంతో తిరిగొచ్చాడు. మరలా తనకున్న ఎకరం పొలంలో వరి నాటు వేసి, కూలి పని చేసేవాడు. ఇదివరకు చేసిన అప్పులు తీర్చే మార్గం తెలియక లోలోన తీవ్ర మనస్తాపానికి గురవుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 12న పొలానికి నీరుపెట్టేందుకు తండ్రిని కొడుకు ప్రవీణ్‌ వదిలిపెట్టాడు. సాయంత్రం ఏడుగంటల ప్రాంతంలో అతను వెళ్లగా నర్సింలు నురగలు కక్కుతున్నాడు. పక్కనే గడ్డిమందు డబ్బా కనిపించింది. వెంటనే మెదక్‌ ప్రభుత్వాసుపత్రికి తరలించాడు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అక్కడ చికిత్సపొందుతూ నర్సింలు మరణించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేటి నుంచి ల్యాబ్‌ టెక్నీషియన్ల సమ్మె



సమ్మె నోటీసు అందజేస్తున్న ఎన్‌హెచ్‌ఎంలు

గజ్వేల్‌రూరల్‌: వైద్యారోగ్యశాఖలోని ఎన్‌హెచ్‌ఎం(నేషనల్‌ హెల్త్‌ మిషన్‌)లో పనిచేస్తున్న తమ సమస్యలు పరిష్కరించాలని ల్యాబ్‌ టెక్నీషియన్లు, స్టాఫ్‌ నర్సులు, ఓటీ టెక్నీషియన్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఆ మేరకు గురువారం నుంచి చేపట్టనున్న సమ్మె నోటీసును బుధవారం పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ సాయికిరణ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వివిధ రూపాల్లో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా ఎలాంటి స్పందనా లేదని పేర్కొన్నారు. రెగ్యులరైజ్‌ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతున్నామని పేర్కొన్నారు. ఎంహెచ్‌ఎంలు పాల్గొన్నారు.

నోటిఫికేషన్‌ రద్దు చేయాలి

సమ్మెకు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మద్దతు



సమ్మెలో ఏఎన్‌ఎంలు

సిద్దిపేటజోన్‌: ప్రభుత్వ ఆస్పత్రులలో పనిచేస్తున్న రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్‌ చేయడంతోపాటు నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్‌ డిమాండ్‌ చేశారు. డిమాండ్ల సాధన కోసం వీరు బుధవారం సమ్మెకు దిగారు. సమ్మెకు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్‌ సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాలో 147 మంది ఉన్నారని, రెగ్యులరైజ్‌ చేయకుండా నోటిఫికేషన్‌ ఇచ్చి పరీక్ష రాయాలని ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తోందని అన్నారు. పథకాల అమలు సందర్భంగా ఒత్తిడికి లోనై చాలామంది ప్రాణాలు కోల్పోయారన్నారు. డిమాండ్లు నెరవేర్చని లేని పక్షంలో సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సునీత, సంగీత, వీణ, అనురాధ, జ్యోతి, బాలనర్సవ్వ, తిరుమల పాల్గొన్నారు.

మనోవేదనతో ఒకరు.. తండ్రి మరణాన్ని తట్టుకోలేక మరొకరు..



చంద్రయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): అతను ఓ సాధారణ కూలీ. కూతురు కంటి ఆపరేషన్‌ కోసం, కుటుంబ పోషణ కోసం అప్పులు చేశాడు. అప్పులోళ్ల నుంచి ఒత్తిడి, ఆమె పెళ్లి చేయలేకపోతున్నానని బాధతో మనస్తాపం చెంది ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని జంగపల్లిలో బుధవారం జరిగింది. ఎస్‌ఐ భువనేశ్వర్‌రావు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ముత్తంగి చంద్రయ్య (54) కూలీ. అతడి కూతురు రేణుక కంటి చూపు సమస్యతో బాధ పడుతోంది. ఆపరేషన్‌ కోసం రూ.లక్ష , కుటుంబ పోషణకు అప్పులు చేశాడు. ఇటీవల రుణదాతల నుంచి ఒత్తిడి వచ్చింది. మరోవైపు కూతురు పెళ్లికి చేయడానికి చేతిలో చిల్లిగవ్వలేదు. ఈ విషయమై ఇరుగు పొరుగుతో చెప్పుకొని బాధపడేవాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన అతను మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య నర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రామచంద్రాపురంలో..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తండ్రి మృతిని తట్టుకోలేక వ్యక్తి మద్యానికి బానిసగా మారి చివరకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన బుధవారం ఉదయం రామచంద్రాపురంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... శ్రీనివాస్‌ నగర్‌ కాలనీకి చెందిన వెంకటనరసయ్య (38) తాపీ మేస్త్రీ. తండ్రి పుల్లయ్య గతేడాది అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ విషయం జీర్ణించుకోలేని అతడు మద్యానికి బానిసయ్యాడు. కాగా మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో రేకుల షెడ్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన చుట్టుపక్కల వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకొని అతడిని ఆసుపత్రికి తరలించే లోపు మృతిచెందాడని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.